సాక్షి
ప్రకాశం
ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024




సింగరాయకొండ క్రాస్ వద్ద అభిమాన నేతకు ఘన స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

గరిష్టం/కనిష్టం
42/27

**వాతావరణం**
పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

**రంజాన్ వేళలు**
ఆదివారం - ఇఫ్తార్ : సా॥ 6.29
సోమవారం - సహరీ : ఉ॥ 4.39

# పశ్చిమం.. జగనోన్మహానం

పశ్చిమ ప్రకాశం.. ఒకప్పుడు కరువు ప్రాంతం. అభివృద్ధికి ఆమడ దూరం. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎం అయ్యాక.. అదే ప్రాంతంలో జలసిరులు పరవళ్లు తొక్కాయి. బీడు భూములు పరవశించాయి. పచ్చని పైర్లతో సస్యశ్యామలమైంది. దశాబ్దాలుగా తాగు, సాగునీటి కష్టాలు తీర్చారు. మరో వైపు మెడికల్ కళాశాల.. సూపర్ స్పెషాలిటీతో వైద్య సదుపాయాలు కల్పించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపించిన పశ్చిమ ప్రకాశాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలోకి తెచ్చిన తమ ప్రియతమ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికేందుకు ఈప్రాంత వాసులు మేమంతా సిద్ధం అంటున్నారు.




పొదిలి సమీపంలోని దొనకొండ క్రాస్‌రోడ్డు వద్ద మేమంతా సిద్ధం సభా ప్రాంగణంలో ఏర్పాట్లు




- నేడు జిల్లాలో మేమంతా సిద్ధం బస్సు యాత్ర
- పొన్నలూరు జువ్విగుంట క్రాస్ నుంచి యాత్ర ప్రారంభం
- పెద్దఅలవలపాడు, కనిగిరి, చిన్నారికట్ల మీదుగా..
- పొదిలి సమీపంలో కేకేమిట్ల అడ్డరోడ్డు వద్ద బహిరంగ సభ
- అభివృద్ధి ప్రదాతకు ఆత్మీయ స్వాగతం పలికేందుకు సిద్ధం

సాక్షిప్రతినిధి ఒంగోలు:

మేమంతా సిద్ధం అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమర శంఖం పూరించి చేపట్టిన బస్సుయాత్ర శనివారం రాత్రి జిల్లాలోకి అడుగుపెట్టింది. కావలిలో బహిరంగ సభ ముగిసిన తర్వాత సింగరాయకొండ క్రాస్ నుంచి కందుకూరు మీదుగా పొన్నలూరు మండలం జువ్విగుంట క్రాస్‌కు సీఎం జగన్ చేరుకున్నారు. ఈ సందర్భంగా రాత్రి 6.55 నిమిషాలకు జిల్లా సరిహద్దుకు చేరుకున్న సీఎంకు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్ నేతృత్వంలో భారీ ఎత్తున అభిమానులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. జువ్విగుంట నుంచి ఆదివారం ఉదయం బస్సుయాత్ర ప్రారంభమవుతుంది. పెద్దఅలవలపాడు, కనిగిరి పట్టణం మీదుగా చిన్నారికట్లకు చేరుకుంటారు. అక్కడ భోజన విరామం అనంతరం కొనకనమిట్ల మండలం పొదిలి, దొనకొండ అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన మేమంతా సిద్ధం బహిరంగ సభకు హాజరవుతారు. సాయంత్రం జరిగే సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నారాంబాబు నేతృత్వంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**పశ్చిమాన అభివృద్ధి రాగం..**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లపాలనలో పశ్చిమ ప్రకాశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. ఒక వైపు సంక్షేమ పథకాలను అందరికీ అందిస్తూనే తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది.

మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారు. 2014–19 ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లో ఫ్యాన్ స్పీడ్‌కు సైకిల్ తుక్కుతుక్కైంది. 2019లో మార్కాపురం నుంచి నాగార్జున రెడ్డి, గిద్దలూరు నుంచి అన్నా రాంబాబు, యర్రగొండపాలెం నుంచి ఆదిమూలపు సురేష్‌లు మంచి మెజార్టీతో విజయం సాధించారు. ప్రస్తుతం మార్కాపురం నుంచి అన్నా రాంబాబు, యర్రగొండపాలెం తాటిపర్తి చంద్రశేఖర్, గిద్దలూరు నుంచి కేపీ నాగార్జునరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి పోటీ చేస్తున్నారు.

**కనిగిరిలో అభివృద్ధి వెలుగులు..**

- రూ.139 కోట్లతో కనిగిరి సమగ్ర రక్షిత మంచి నీటి పథకాన్ని ప్రారంభించారు. పనులు ప్రారంభమయ్యాయి.
- రూ.100 కోట్లతో ఉళ్లపాళెం నుంచి వేములపాడు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. చివరి దశలో ఉన్నాయి.
- రూ.11 కోట్లతో చేపట్టిన కనిగిరి నుంచి కలగట్ల రహదారి పనులు పూర్తికావచ్చాయి.
- ఇవికాకుండా కనిగిరి నియోజకవర్గంలో రూ.369.87 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు.

**గిద్దలూరు నియోజకవర్గంలో**

గిద్దలూరు నియోజకవర్గంలో గిద్దలూరులో రూ.24 కోట్లు, కంభంలో రూ.3 కోట్లతో సామాజిక ప్రాంతీయ వైద్యశాలలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 118 జగనన్న లేఅవుట్లలో 3228 మందికి నివేశన స్థలాలు మంజూరు చేశారు. రైతు భరోసాలో 47,144 మందికి రూ.220.55 కోట్లు, అమ్మ ఒడి పథకంలో 31,504 మందికి రూ.140.14 కోట్లు పంపిణీ చేశారు.


సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బాలినేని


సీఎంను స్వాగతిస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి

## పేదల ముంగిటకు కార్పొరేట్ వైద్యం..

నాడు వైద్యసేవలు సకాలంలో అందక రోగుల ప్రాణాలు గాలిలో కలిసేవి. చిన్నపాటి రోగం వచ్చినా మెరుగైన వైద్యం కోసం గుంటూరు, ఒంగోలు, కర్నూలు, నెల్లూరు, విజయవాడకు పరుగెత్తాల్సిన దుస్థితి ఉండేది. నేడు కార్పొరేట్ వైద్యం ప్రజల ముంగిటకు వచ్చేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేశారు. మార్కాపురంలోని జిల్లా వైద్యశాలలో 57 మంది వైద్యులతో సేవలందిస్తున్నారు. రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణం, దోర్నాలలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు జరుగుతున్నాయి. జిల్లా వైద్యశాలలో సుమారు రూ.10 కోట్లకు పైగా నిధులు కేటాయించడంతో వైద్యశాలలో అన్ని సౌకర్యాలు సమకూరాయి.


నిర్మాణంలో ఉన్న మార్కాపురం మెడికల్ కాలేజీ


వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్న సీఎం జగన్ (ఫైల్)

## వెలిగొండకు మోక్షం..

నాడు ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భూమిపూజ చేసి వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తే ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోలవరం తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు దాదాపు రూ.5,974.21 కోట్లు ఖర్చు చేసింది.

## తీరనున్న నీటి సమస్య...

పశ్చిమ ప్రకాశంలోని మూడు నియోజకవర్గాల్లో శాశ్వతంగా కరువు నివారించేందుకు గొట్టిపడియ దగ్గర రూ.1230 కోట్లతో ఇన్‌టెక్ వెల్ ట్యాంక్ మంజూరు చేశారు. దాని నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఇక్కడి నుంచి వెలిగొండ నీటిని మూడు నియోజకవర్గాల్లోని ప్రజలకు అందిస్తారు.

- పశ్చిమ ప్రకాశం రోడ్లకు సైతం మహర్దశపట్టింది. ఐదేళ్లలో రూ.18.89 కోట్లతో రోడ్ల అభివృద్ధి, హై ఇంపాక్ట్ కింద సీఎం ప్రత్యేక నిధులు విడుదల చేశారు, రూ.18.47 కోట్లతో బీటీ రోడ్ల అభివృద్ధి చేశారు.


నిర్మాణంలో ఉన్న ఇన్‌టెక్‌వెల్ ట్యాంకు

## ఘన స్వాగతం..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సుయాత్ర సింగరాయకొండ మండలానికి సుమారు శనివారం సాయంత్రం 6:55 గంటలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాష్ట్ర మంత్రి, కొండపి అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి వారికి ఘన స్వాగతం పలికారు. మంత్రి సురేష్ భారీ గజమాలతో స్వాగతం పలికారు. డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి తాను నిర్మించిన వైఎస్సార్ ఆర్చిని బస్సులో నుంచే జగన్‌మోహన్‌రెడ్డికి చూపించారు. తరువాత బస్సు సింగరాయకొండ క్రాస్ రోడ్డుగుండా కందుకూరు రోడ్డులోకి ప్రవేశించింది. కనుమళ్ల పంచాయతీ చిన కనమళ్ల వద్ద మహిళలు భారీగా ఉండటంతో బస్సు ఆపి వారితో జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. తరువాత పొన్నలూరు మండలం ముత్తరాసుపాలెం వద్ద వద్ద ప్రజలతో సీఎం జగన్ మాట్లాడారు. తరువాత పొన్నలూరు మండల కేంద్రంలో భారీగా జన సందోహం మధ్య బస్సు ఆపి ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం నాగిరెడ్డిపాలెం, వెంకుపాలెం గ్రామాల్లో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. జువ్విగుంట క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన విడిది ప్రాంతానికి చేరుకున్నారు. సీఎం జగన్‌కు స్వాగతం పలికిన వారిలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, పోతుల సునీత, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్, సింగరాయకొండ మండల పార్టీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, పొన్నలూరు మండలంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ మాధవరావు, పార్టీ మండల అధ్యక్షుడు పల్లపోలు బాలకోటిరెడ్డి తదితరులు ఉన్నారు.


సీఎం రాకకోసం ఎదురుచూస్తున్న సురేష్, చెవిరెడ్డి

## 'మేమంతా సిద్ధం'కు సర్వ సన్నద్ధం


సభా ప్రాంగణంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సునీల్

కొనకనమిట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని పొదిలి, కొనకనమిట్ల సమీపంలోని దొనకొండ అడ్డరోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా సన్నాహాలు పూర్తి చేసి సిద్ధం సభకు సర్వసన్నద్ధం చేశారు. వేదిక ముందు భాగంలో పార్టీ ఎన్నికల గుర్తు ఫ్యాన్ ఆకారంలో వాక్ వేను ఏర్పాటు చేశారు. వేదికతో పాటు గ్యాలరీలు నిర్మించారు.

**సభావేదికను పరిశీలించిన ఎస్పీ..**

'మేమంతా సిద్ధం' సభ జరిగే ప్రాంగణాన్ని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ శనివారం సాయంత్రం పరిశీలించారు. సభా వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ వంటి విషయాలపై పోలీస్ అధికారులతో చర్చించారు. సభ వద్ద ఉండే సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ముఖ్యమంత్రి పర్యటనలో జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్పీతో పాటు దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, పొదిలి సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐలు మాధవరావు, కోటయ్య ఉన్నారు.

**సభను జయప్రదం చేయాలి**

ఒంగోలు: మేమంతా సిద్ధం సభను ప్రజలు జయప్రదం చేయాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ అభ్యర్థి, రీజినల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. మాట ఇస్తే మడమ తిప్పని నేతగా, పశ్చిమ ప్రకాశంలో తాగు, సాగునీటి సమస్యకు శాశ్విత పరిష్కారం దిశగా ఇప్పటికే వెలిగొండ ప్రాజెక్టు రెండు టన్నెళ్లు పూర్తిచేసిన నేతగా జిల్లాకు వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అఖండ స్వాగతం పలికేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.


సింగరాయకొండ హైవేపై సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు


జగనన్నకు అక్కచెల్లెమ్మల ఆత్మీయ కరచాలనం


సింగరాయకొండ హైవేపై పార్టీ నాయకులు, అభిమానులు


జగన్ మామను చూసి చిన్నారుల కేరింత

## న్యూస్‌రీల్

### మేమంతా సిద్ధం కార్యక్రమానికి అనుమతి

ఒంగోలు అర్బన్: జిల్లాలో జరిగే మేమంతా సిద్ధం కార్యక్రమానికి సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస్సుయాత్ర జిల్లాలో ప్రవేశించినప్పటి నుంచి జరిగే రోడ్డు షోలు, సమావేశాలు, సభలకు సంబంధించి జిల్లా స్థాయిలో అనుమతులు కోరుతూ వైఎస్ ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పంపిన లేఖను జిల్లా పార్టీ ఎలక్షన్ రిప్రజెంటేటివ్ దామరాజు క్రాంతికుమార్ శనివారం ప్రకాశం భవనంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్‌కు అందచేసి అనుమతులు కోరారు. పరిశీలించి ఆ మేరకు ఎన్నికల అధికారి అనుమతులు మంజూరు చేశారు.

### సీఎం బస్సుయాత్రకు భారీ బందోబస్తు

- పరిశీలించిన ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, ఏఎస్పీ నాగేశ్వరరావు



దర్శి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ఏర్పాటు చేసిన బందోబస్తును ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ శనివారం పరిశీలించారు. సీఎం బస్సులో బసచేసే ప్రాంతాన్ని, ఆ తరువాత వృద్ధులతో ముఖాముఖి నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ అశోక్‌వర్ధన్, ఆర్డీఓ జాన్‌ఇర్విన్, సీఐలు సమీఉల్లా, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

### ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంపై కలెక్టర్ కన్నెర్ర

ఒంగోలు అర్బన్: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కన్నెర్ర చేశారు. ఆ మేరకు శనివారం రాత్రి ఒకరిపై సస్పెన్షన్ వేటు వేయగా 59 మంది పీవో, ఏపీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎన్నికల విధులకు సంబంధించి శిక్షణలో భాగంగా పీవోలు, ఏపీవోలకు జరిగిన మొదటి విడత శిక్షణలో 59 మంది గైర్హాజరయ్యారు. దీంతో వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జీఆర్ఆర్ డివిజన్–2లో ఇరిగేషన్ ప్రాజెక్టు ఇంజినీరు కార్యాలయం సూపరింటెండెంట్ మోతే రామారావు మద్యం తాగి హాజరుకావడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### నేడు ట్రాఫిక్ మళ్లింపు

ఒంగోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర, బహిరంగ సభ సందర్భంగా ఆదివారం ప్రయాణికుల సౌకర్యార్థం వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

- మార్కాపురం నుంచి ఒంగోలు వైపు వెళ్లే వాహనాలు నాగిరెడ్డిపల్లి దగ్గర నుంచి వెలిగొండ స్వామి గుడి మీదుగా చినమనగుండం వద్ద నంద్యాల నుంచి ఒంగోలు వెళ్లే రహదారిలో వెళ్లాలి.
- ఒంగోలు నుంచి మార్కాపురం వైపు వెళ్లే వాహనాలు పొదిలి, చిన్నారికట్ల జంక్షన్ దాటిన తర్వాత పాతపాడు మీదుగా కాట్రగుంట, చౌటపాలెం మీదుగా మార్కాపురం వెళ్లాలి.
- బస్సు యాత్ర కనిగిరి నుంచి బహిరంగ సభ వేదికకు వచ్చే సమయంలో కనిగిరి వైపు వెళ్లే వాహనాలను కంభాలపాడు వద్ద కొంత సమయం ఆపుతారు. అదేవిధంగా బస్సు యాత్ర బహిరంగ సభ వేదిక నుంచి పొదిలి పట్టణంలోగుండా దర్శి వెళ్లే సమయంలో ఒంగోలు వైపు నుంచి వచ్చే వాహనాలను కాటూరివారిపాలెం సబ్‌స్టేషన్ వద్ద, గిద్దలూరు వైపు నుంచి ఒంగోలు వెళ్లే వాహనాలను చిన్నారికట్ల జంక్షన్ దాటిన తర్వాత కంభాలపాడు వద్ద కొంత సమయం ఆపుతారు.
- ఒంగోలు వైపు నుంచి గిద్దలూరు, దర్శి వెళ్లే భారీ వాహనాలు, కంకర్ టిప్పర్లను రేపు ఎట్టి పరిస్థితుల్లో పొదిలి టౌన్ వైపు అనుమతించరు. వాహనదారులు పోలీసు వారి సూచనలకు అనుగుణంగా సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## క్లుప్తంగా

### చెవిరెడ్డిని సత్కరించిన మంత్రి సురేష్



సింగరాయకొండ (మర్రిపూడి): వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డిని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, పార్టీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఘనంగా సత్కరించారు. సింగరాయకొండ లోని మంత్రి సురేష్ క్యాంపు కార్యాలయానికి శనివారం మధ్యాహ్నం చెవిరెడ్డి భాస్కరరెడ్డి వచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లపై సమీక్షించారు. బస్సు యాత్ర జయప్రదం చేసేందుకు అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెవిరెడ్డి సూచించారు.

### గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు బాల బ్రహ్మయ్య ( ఫైల్)

మర్రిపూడి: గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. బంధువులు తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని శివరాయునిపేట గ్రామానికి చెందిన మన్నెం బాల బ్రహ్మయ్య (40) వరంగల్ జిల్లాలో బేల్దారీ మేస్త్రీగా పనిచేస్తుంటాడు. అయితే ఆ పని కలిసిరాకపోవడంతో స్వగ్రామమైన శివరాయునిపేట గ్రామంలో జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 3న సొంత పనుల నిమిత్తం శివరాయునిపేట గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై పొదిలి బయలుదేరాడు. కెల్లంపల్లి గ్రామం సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో బాల బ్రహ్మయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. బాలబ్రహ్మయ్య చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు.

# ఇఫ్తార్ సాక్షిగా కూటమిలో లుకలుకలు

- రెండు వర్గాలుగా విడిపోయిన టీడీపీ నేతలు
- కార్యక్రమానికి హాజరైన బీజేపీ నేతలకు అవమానం

సాక్షి ప్రతినిధి ఒంగోలు: సింగరాయకొండ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు సాక్షిగా కూటమిలో లుకలుకలు వెలుగుచూశాయి. టీడీపీలో వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ఇఫ్తార్ విందుకు ముస్లిం, మైనార్టీ సామాజికవర్గం కూడా నామమాత్రంగానే హాజరయ్యారన్న ప్రచారం జరిగింది. వాస్తవానికి ఇఫ్తార్ విందును ఈ నెల 7వ తేదీ ఆదివారం ఏర్పాటు చేయాలని టీడీపీ మండల నాయకుడు, మాజీ సర్పంచ్ చెప్పినప్పటికీ మరొకవర్గం శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది. తన మాట పెడచెవిన పెట్టారన్న ఆగ్రహంతో మాజీ సర్పంచ్, అతని మేనల్లుడు ఈ కార్యక్రమానికి నామమాత్రంగా హాజరై పట్టీపట్టనట్లు వ్యవహరించారు. అంతేగాకుండా ఇఫ్తార్ విందు జరిగే ఈద్గ మిట్ట దర్గా ప్రాంతానికి సమీపంలోని మసీదుల్లో పోటీగా భోజనాలు పెట్టించారని, ఫలితంగా ముస్లింలు స్వల్పంగా హాజరయ్యారని తెలిసింది. నియోజకవర్గంలో పార్టీపరంగా ఇప్పటి వరకూ ఈ మాజీ సర్పంచ్ ప్రధానపాత్ర పోషించారు. అంతేగాకుండా గత ప్రభుత్వంలో మండల కోఆప్షన్ సభ్యుడిగా ఉన్నాడు. అయితే, పార్టీలో ఇతనంటే గిట్టని అదే సామాజికవర్గానికి చెందిన మరోవర్గం పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తోంది. ఈ నెల 7వ తేదీ ఆదివారం ఈ మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు జరుగుతుందన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. శుక్రవారం జరిగిన ఇఫ్తార్ విందుకు రంజాన్ ఉపవాస దీక్ష తీసుకున్న ముస్లింలు కేవలం చాలా తక్కువ సంఖ్యలో వచ్చారని, ఇతర సామాజికవర్గానికి చెందిన వారు మాత్రం భారీగా వచ్చారని చర్చించుకుంటున్నారు.

**బీజేపీ నాయకులకు అవమానం...**

ఇఫ్తార్ విందుకు బీజేపీ నాయకులకు ఆహ్వానం అందడంతో ఆ పార్టీ నాయకులు వచ్చారు. విందుకు వచ్చేటప్పుడు పార్టీ కండువాలు వేసుకుని రావద్దని మరీ వారికి ఆంక్షలు విధించారు. బీజేపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మలినేని గీతాంజలి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివకుమారి, అచింత, జిల్లా కార్యదర్శి తిరుమల, కొండపి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి సుల్తానా, మండల ఉపాధ్యక్షుడు కుంచాల శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశం ప్రారంభమవ్వగానే వేదిక మీదకు టీడీపీ, జనసేన నాయకులను పిలిచారు. వేదిక ముందున్న బీజేపీ నాయకులను విస్మరించారు. చివరికి బీజేపీ ముస్లిం నాయకురాలు సుల్తానాను కూడా వేదిక మీదకి పిలవలేదు. దీంతో వీరు ఆగ్రహం వ్యక్తం చేసి ఇఫ్తార్ విందు చేయకుండానే సమావేశం నుంచి అర్ధంతరంగా వెళ్లిపోయారు. దీనిపై తమ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు బీజేపీ నాయకులు తెలియజేస్తున్నారు. వాస్తవానికి ఈ కార్యక్రమానికి హాజరుకాకూడదని అనుకున్నామని, కానీ పదేపదే ఫోన్ చేసి ఆహ్వానించడంతో వెళ్లామని, తీరా మహిళలు అని చూడకుండా మమ్మల్ని అవమానపరిచారని ఆ పార్టీ మహిళా నాయకురాలు ఆరోపించింది. దీంతో కూటమిలో లుకలుకలు బయటపడ్డాయి.

# ఓట్లు అడిగే అర్హత వైఎస్సార్ సీపీకే ఉంది




బొడ్డువారిపాలెంలో ప్రసంగిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

- చంద్రబాబులా ఉత్తుత్తి హామీలిచ్చే ప్రభుత్వం మాది కాదు
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగు నాగార్జున
- బొడ్డువారిపాలెం, బీ మాచవరంలో ఎన్నికల ప్రచారానికి బ్రహ్మరథం

సంతనూతలపాడు (చీమకుర్తి): ఓట్లు అడిగే అర్హత వైఎస్సార్ సీపీకే ఉందని ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగు నాగార్జున అన్నారు. సంతనూతలపాడు మండలం బొడ్డువారిపాలెం, బీ మాచవరం గ్రామాల్లో శనివారం రాత్రి గడపగడపకు మన నాగార్జున అన్న కార్యక్రమం పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసేదే చెబుతామని, చెప్పినవన్నీ చేస్తామని స్పష్టం చేశారు. ఆ నమ్మకం ప్రజల్లో బలంగా ఉందన్నారు. అంతేగానీ చంద్రబాబులా ఉత్తుత్తి హామీలిచ్చి..అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను మోసం చేసే ప్రభుత్వం తమది కాదన్నారు. స్థానిక ప్రజలు బ్రహ్మరథం పట్టి అడుగడుగునా ఆదరాభిమానాలతో మేరుగు నాగార్జునకు స్వాగతం పలికారు. అనేకమందిని పేరుపేరునా తల్లి బాగున్నారా.. అక్కయ్య బాగున్నారా.. అంటూ పలకరిస్తూ ఆయన ముందుకు సాగారు. దీంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. బొడ్డువారిపాలెంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..లేదా..? అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. బీ మాచవరం గ్రామంలోనూ మేరుగు ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బి.విజయ, జెడ్పీటీసీ దుంపా రవణమ్మ, సొసైటీ అధ్యక్షుడు దుంపా యలమందారెడ్డి, బొడ్డువారిపాలెం సర్పంచ్ వెంకటరెడ్డి, మద్దులూరు గ్రామ సర్పంచ్ మైనం శైలజ, మైనం అమర్నాథ్, మండల మహిళా అధ్యక్షురాలు ములకలపల్లి సీతమ్మ, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వరరావు, వార్డ్ మెంబర్ దాసరి కోటి, చీదెళ్ల అర్జున్, రేవతి, తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ నాయకుడు దమ్మాల శ్రీనివాసరావు, పేర్నమిట్ట జేసీఎస్ నాయకుడు కత్తినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జగనన్నకు మరో అవకాశం ఇవ్వండి



సాధువారిపాలెంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్



మంత్రి సురేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన 40 మంది టీడీపీ కార్యకర్తలు

- మంత్రి ఆదిమూలపు సురేష్

జరుగుమల్లి: మీ కుటుంబంలో మంచి జరిగిందని అనుకుంటే జగనన్నకు మరొక్క అవకాశం ఇవ్వాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ అభ్యర్థి ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని పాలేటిపాడు పంచాయతీ పరిధి లోని సాధువారిపాలెం గ్రామంలో ×పల్లె పల్లె కు¢ సిద్ధం కార్యక్రమాన్ని మంత్రి ఆదిమూలపు సురేష్ శనివారం నిర్వహించి ప్రచారం చేపట్టారు. గ్రామంలో దగ్గుమాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో జగనన్న ప్రభుత్వం మరింత మేలు చేస్తుందని, సంక్షేమ పథకాల అమలులో ముందంటుందన్నారు. అలవికాని హామీలు ఇచ్చి సిగ్గు ఎగ్గు లేకుండా, షూరిటీలు అంటూ, కూటములు కడుతూ కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రతిపక్ష పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సామాజిక న్యాయం, ఎస్సీ, ఎస్టీలు, కూలీలకు మెరుగైన జీవన ప్రమాణం, పరిశుభ్రత, పరిస్థితులు మనం కల్పించామన్నారు. పేదల ఆర్థిక స్వావలంబన కోసం సంక్షేమ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేసిందన్నారు. ఐదేళ్లలో 125 సార్లు జగనన్న బటన్ నొక్కి ప్రజలకు ఆర్థికంగా బలవంతులను చేశారన్నారు. ఓటుని సద్వినియోగం చేసుకొని మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. జగనన్న బలపరిచిన పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కొండపి అసెంబ్లీ అభ్యర్థిగా నన్ను గెలిపించి ఒక్క అవకాశం ఇవ్వాలన్నారు. గతంలో ఉన్న ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి ఏం చేశాడో చెప్పాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నిక శ్రీనివాసరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బత్తిన మనోహర్, జేసీఎస్ కన్వీనర్ తాటికొండ రామచంద్రరావు, కనపర్తి శేషారెడ్డి, చుండి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కాకర్లమూడి శాంతమ్మ, జరుగుమల్లి సర్పంచి కసుకుర్తి పున్నారావు, కొండూరి ప్రశాంత రెడ్డి, దుంపా అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

**పార్టీలో చేరికలు..**

సాధువారిపాలెం గ్రామంలో దగ్గుమాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 40 మంది వైఎస్ఆర్ సీపీలో చేరారు. వారికి మంత్రి ఆదిమూలపు సురేష్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కాకర్లమూడి అమరేశ్వరరావు, పాటిబండ్ల బ్రహ్మయ్య, పాటిబండ్ల పోలు, పాటిబండ్ల సురేష్, కాకర్లమూడి యల్లమంద, పాటిబండ్ల సుబ్బారావు, పాటిబండ్ల సుమలత, కంకిపాటి శ్రీను, పాటిబండ్ల సుధీర్, కాకర్లమూడి పేరయ్య, పాటిబండ్ల రజిత వలి, కాకర్లమూడి నరశింహారావు, పాటిబండ్ల చిరంజీవి, పాటిబండ్ల మోషే తదితరులు ఉన్నారు.

# లిక్కర్ డిపోను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

ఒంగోలు అర్బన్: స్థానిక పేర్నమిట్ట వద్ద ఉన్న ఐఎంఎల్ లిక్కర్ డిపోను శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ పరిశీలించారు. డిపోలో ఉన్న స్టాక్ వివరాలను పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం సరఫరాలో ఎటువంటి అక్రమాలు జరగకుండా డిపో నిర్వహించాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



లిక్కర్ డిపోను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

# ఉసురు తీసిన ఈత సరదా



మృతుడు మన్నెం వెంకటేశ్వర్లు



మృతుడు పత్తి వెంకటేశ్వర్లు

- ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి

దొనకొండ: సరదాగా ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృత్యువాతపడిన ఘటన దొనకొండ మండలం ఇండ్లచెరువులో శనివారం జరిగింది. గ్రామస్తులు, బంధువుల సమాచారం మేరకు.. దొనకొండ మండలంలోని మల్లెలవాగులో గంగవరం గ్రామానికి చెందిన రైతులు పంటలు పండించుకునేందుకు జేసీబీలతో 40 అడుగుల పొడవు, 20 అడుగుల లోతు బావులు తవ్వుకున్నారు. మోటార్ల ద్వారా పంటలకు నీరు సరఫరా చేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల యువకులు కొందరు మధ్యాహ్న సమయంలో అక్కడ సరదాగా ఈతకొట్టేవారు. ఈ క్రమంలో శనివారం గ్రామానికి చెందిన పత్తి నారాయణ, సాలమ్మ దంపతుల ఏకైక కుమారుడు పత్తి వెంకటేశ్వర్లు (20), మన్నెం పుల్లమ్మ ఏకైక కుమారుడు మన్నెం వెంకటేశ్వర్లు (25) స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లారు. వారిలో పత్తి వెంకటేశ్వర్లుకు ఈత సరిగ్గా రాదు. అయినా బావిలో దిగడంతో నీటమునిగిపోతుండటాన్ని గమనించి అతడిని రక్షించేందుకు మన్నెం వెంకటేశ్వర్లు వెంటనే బావిలో దిగాడు. కొంత సేపటికి ఇద్దరూ నీట మునిగి ఊపిరాడక మృతిచెందారు. గ్రామస్తులు, బంధువులకు అక్కడున్న స్నేహితులు సమాచారం అందించారు. వెంటనే తల్లిదండ్రులు, బంధువులు వెళ్లి ఇద్దరినీ బయటకు తీశారు. చేతికి అందివచ్చిన కొడుకులు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామస్తులు, బంధువుల ఆర్తనాదాలతో గ్రామం శోకసంద్రమైంది. పత్తి వెంకటేశ్వర్లు పదో తరగతి ఫెయిలై తల్లిదండ్రులతో పొలం పనులకు వెళ్తుండగా, మన్నెం వెంకటేశ్వర్లు డిగ్రీ వరకు చదువుకున్నాడు. సంఘటన స్థలాన్ని ఏఎస్ఐ కె.శ్రీనివాసరావు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### జీవితంపై విరక్తితో వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన బత్తిన కోటేశ్వరరావు

మద్దిపాడు: కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. నాగులుప్పలపాడు మండలం మద్దిరాలకు చెందిన బత్తిన కోటేశ్వరరావు (36) భార్య, పిల్లలతో కలిసి సంవత్సరం నుంచి మద్దిపాడు ఎస్సీకాలనీలో నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో పాటు శనివారం తన మేనల్లుడు గుంటూరి వెంకట సుధాకర్‌కు వాట్సాప్‌లో వీడియో పంపాడు. తాను జీవితంపై విరక్తి చెంది ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఆ వీడియోలో తెలపడంతో అతనిని వెతికి అప్పగించాలంటూ మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో గుంటూరు వెంకట సుధాకర్ ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఏఎస్ఐ రమేష్‌కృష్ణ కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించి ఫోన్ సిగ్నల్‌ను ట్రాక్ చేయించగా, హైదరాబాదులోని అఫ్జల్ గంజ్ గౌలిగూడ వద్ద ఉన్నట్లు తెలిసింది. దీంతో అతనిని ట్రాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి



మృతిచెందిన ప్రసన్న

కొమరోలు: అనుమానాస్పద స్థితిలో తీవ్ర గాయాలతో ఓ గర్భిణి మృతి చెందింది. ఈసంఘటన కొమరోలులోని చర్చి వీధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. కొనకనమిట్ల మండలంలోని మునగపాడు గ్రామానికి చెందిన లంకోజి ప్రసన్న (30)కు మండలంలోని మొట్టుపల్లె గ్రామానికి చెందిన లంకోజీ నారాయణకు 15 ఏళ్ల క్రితం పెద్దలు వివాహం చేశారు. గతకొంత కాలంగా మొట్టుపల్లె గ్రామంలో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులు అనంతరం 4 నెలల క్రితం కొమరోలులోని చర్చి వీధిలో ఓ ఇంటిలో బాడుగకు చేరారు. నారాయణ కార్పెంటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం తన నాలుగేళ్ల పాపను నారాయణ.. పని వద్దకు తీసుకుని వెళ్లి తిరిగి వచ్చే సరికి 4 నెలల గర్భిణి అయిన లంకోజీ ప్రసన్న బాత్‌రూంలో జారిపడి తలకు తీవ్ర గాయాలై మృతి చెంది ఉందని తెలిపాడు. ప్రసన్న కుటుంబ సభ్యులకు నారాయణ సమాచారం అందించడంతో అక్కడకు చేరుకున్న ఆమె సోదరుడు యద్దనపూడి గురుసాయి.. మృతిపై అనుమానం ఉన్నట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గిద్దలూరు వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

### దివ్యాంగులు, వృద్ధులు ఓటేసేందుకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులు, వృద్ధులు ఓటేసేందుకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ప్రకాశం భవనంలో వికలాంగులు, వృద్ధులు ఓటేసేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ చైర్స్, ర్యాంపులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దనే ప్రత్యేక పోస్టల్ బ్యాలెట్ సదుపాయంపై అవగాహన కల్పించాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక రవాణా సదుపాయాలపై ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ శ్రీలత, దివ్యాంగుల సంక్షేమ శాఖాధికారి అర్చన, డీఈఓ సుభద్ర, బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ అధికారి ఉదయశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల వసతులపై అవగాహన అవసరం

- జేసీ గోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

సంతనూతలపాడు (చీమకుర్తి): ఓటర్లు, పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన అన్ని వసతులు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆర్.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. శనివారం సంతనూతలపాడులోని ఎస్.ఎస్.ఎన్.కాలేజీలో నియోజకవర్గంలోని 4 మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు కల్పించాల్సిన సదుపాయాలు, విధులపై పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపు, టాయిలెట్లు, విద్యుత్, ఫర్నిచర్ ఏర్పాటు చేయడం, ముందురోజు మహిళా సిబ్బందికి విడిగా వసతులు కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం, లోపాలు ఉండకూడదని జేసీ స్పష్టం చేశారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ, ఎన్నికల సంబంధిత ఇతర విధుల్లో వలంటీర్లను ఎట్టి పరిస్థితుల్లో భాగస్వాములను చేయరాదని ఆదేశించారు. దివ్యాంగులకు, 85 ఏళ్లు పైబడిన వృద్ధులకు హోం ఓటింగ్ సదుపాయం కల్పించడానికి ముందుగానే వారి వివరాలు సేకరించాలని, ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా వారికి అవగాహన కల్పించాలని జేసీ సూచించారు.

### పురుటి నొప్పుల భయంతో గర్భిణి బలవన్మరణం



ఉరి వేసుకుని మృతిచెందిన రాగసాని వెంకట పద్మావతి

సీఎస్‌పురం (పామూరు): పురిటినొప్పులు తట్టుకోలేననే భయానికి గురైన గర్భిణి ఉరివేసుకుని మృతిచెందిన ఘటన శుక్రవారం సీఎస్‌పురం మండలంలోని కొండబోయినపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ రామానాయక్, ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాలు... కొండబోయినపల్లి గ్రామానికి చెందిన రాగసాని రమణయ్య, వెంకట పద్మావతి (26)లకు ఇద్దరు ఆడపిల్లలు. వెంకట పద్మావతికి తొలి రెండు కాన్పులు సాధారణ కాన్పులు అయ్యాయి. ఆ సమయంలో తీవ్రమైన పురుటి నొప్పులతో బాధను అనుభవించింది. వెంకట పద్మావతి మూడో సారి గర్భిణి కాగా కాన్పు సమయం దగ్గరపడుతోంది. ఈ నేపథ్యంలో పురుటి నొప్పులు తట్టుకోలేనేమోనన్న భయం ఆమెను వెంటాడింది. చుట్టుపక్కల వారు, తల్లిదండ్రులతో పాటు, భర్తకు తన ఆవేదన చెప్పుకుంది. దీంతో ఈదఫా సిజేరియన్ ఆపరేషన్ చేయించేందుకు వారు అంగీకరించారు. అయినా తీవ్రమైన మానసిక ఆందోళనతో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో పద్మావతి ఇంటి పైకప్పు రేకులకు ఉండే రాడ్‌కు చీరతో ఉరివేసుకుంది. కొంతసేపటి తరువాత చూసిన కుటుంబ సభ్యులు వెంటనే సీఎస్‌పురం వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే పద్మావతి మృతిచెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు.

దీనిపై మృతురాలి తండ్రి కామనబోయిన తిరుపతయ్య శనివారం తన కుమార్తె ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి తరలించారు.

# ముగిసిన శిక్షణ తరగతులు

ఒంగోలు: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో ఐదు రోజుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన చరిత్ర, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు ఈ శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ , ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తరగతుల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచుకోవచ్చన్నారు. ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు. నోడల్ రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మంజుల భారతి మాట్లాడుతూ శిక్షణ తరగతులకు సహకరించిన అధ్యాపకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించారు.